అజంతా అందం

మారేమండ
సీతారామయ్య

కళ్యాణి ఈ కథకు నాయిక.

అయితే కళ్యాణిగురించి చెప్పేముందు తాతయ్య విషయం ఇక్కడ వివరంగా చెప్పటం ఎంతో అవసరం. తాతయ్య పుట్టింది పురాతనయుగంలోనైనా ఆధునిక భావాలకు అలవడ్డాడే. మారిన కాలంతోపాటు మన తత్త్వాలు మారాలనే మాటకారి ఆదర్శవాదికాకుండా మారిన మన తత్త్వం గల అసలైన ఆదర్శవాది మూఢాచారాలను, మసిపట్టిన పాతభావాలను

కొద్దిగా నమ్మినా అవసరమొస్తే ఆవల నెట్టటానికి వెనుదీయని స్వభావి. తాతయ్య వద్ద నాకు చిన్నతనంనుండి కొద్దింత చనువుంది. ఆయన నన్ను స్నేహితుడిలా చూస్తారు.

పోతే కళ్యాణి విషయం - ఒకే మాటలో చాలా మంచిది. కాని ఈ ముక్కే మీరు తాతయ్యతో అంటే ఇంతెత్తుకస్సుమని లేచి రామూగాడ్ని లేపుకుపోదామని ప్రయత్నించిన వన్నెలాడి (బి.ఎ కూడానూ) అని అంటాడు. అని ఊరుకోడు. పెద్దింటికుర్రాడిపై కన్నేసింది కాబట్టే అడ్రసు లేకుండా పరారైంది. ఏమైనా ఒకటిమాత్రం నిజం మా రాము అదృష్టవంతుడు. ఓ విషవలయంనుంచి విముక్తుడయ్యాడు' అని కూడా అంటాడు. వెంటనే ఏపనిచేస్తున్నా తన పొన్నుకర్రతీసుకుని గడగడా బయటకు వెళ్ళిపోతాడు.

• • •

మనం కోరుకున్నరీతిలో మనస్సుకు నచ్చినవిధంగా ఓ శిల్పం చెక్కబడిఉంటే ఆ శిల్పసౌందర్యం చూసి సంతృప్తి చెందలేం. ఆరాధించి పూజిస్తాం. అందుబాటులో ఉంటే ఆశిల్పానికి ప్రాణంపోసి ఆ సౌందర్యాన్ని కైవసం చేసుకుంటాం. కళ్యాణి విషయంలోకూడా అంతే జరిగింది.

విశాఖపట్నం ప్లీడరీ చదువుకు వెళ్ళిన కొత్తలో ఇంటివైపు పదే పదే వెళ్ళే ధ్యానను మరోవైపు మళ్ళించే నెపంలో రోజూ బీచికు వెళ్ళటం. అక్కడ ఓ రెండు మూడు గంటలు గడపటం అలవాటు చేసుకున్నాను. నాలాగే నేను కూర్చొన్న చోటుకు ఓ పది గజాల దూరంలో రోజూ ఓ యువతి కూర్చొనేది. తను కట్టుకున్న తెల్లచీర కుచ్చెళ్ళ అంచులు చిరుకెరటాల తాకిడిచే తడుస్తూంటే లక్ష్యపెట్టకుండా తీర్చిదిద్దిన అజంతా సుందరిలా సముద్రాన్ని తదేకంగా చూస్తూండేది. అపరిసర ప్రకృతిలో ఆమె కూడా ఓ భాగమై పోయింది. ఆమె అజంతా అందం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. చిరునవ్వులతో ప్రారంభమైన మా స్నేహలత క్రమంగా విరగబడి ఏపుగా పెరిగింది. మేం భవిష్యత్తులో విడిపోయి బ్రతకలేనంత దగ్గరితనం నేర్పరిచింది. అందుకే కళ్యాణిని నేను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను.

• • •

"ఆ అమ్మాయి పేరు?"

"కళ్యాణి."

"ఎంత కాలం నుంచీ పరిచయం?"

"రెండేళ్ళ నుంచి. బీచ్‌లో పరిచయమైంది. చాలా కాలం నుంచీ మీకు చెప్పాలని అనుకుంటూనే ఉన్నాను. క్రిందటి సారి వచ్చినపుడు ఇక్కడికి తీసుకొచ్చి పరిచయం చేద్దామనుకున్నాను."

తాతయ్య ప్రాణస్నేహితుడైన రాఘవరావుగారు విశాఖ వచ్చినపుడు బీచిలో నన్నూ కళ్యాణిని జంటగా చూడటంతో సెలవలకు రాంగానే తాతయ్య నిలదీసాడు.

"ఉట్టి స్నేహమేనా - ఇంకేమైనా ఉందా?"

"ప్రస్తుతానికి ఉత్త స్నేహమే. ఇకపైన మీ అనుమతితో ఆమెను వివాహం చేసుకోవాలనుకుంటున్నాను."



"ఊఁ చాలా వరకు వచ్చింది: ఎప్పుడూ చెప్పలేదేం?"

"అవసరం రాలేదు కాబట్టి చెప్పలేదు. ఇప్పుడు సమయం వచ్చింది కాబట్టి చెపుతున్నాను."

"ఆ అమ్మాయికి తల్లిదండ్రులు ఉన్నారా?"

"తల్లి ఉంది. తండ్రి సంగతి తెలియదు."

"అంటే?"

"కళ్యాణి అమ్మగారు పెళ్ళికాకముందే గర్భవతయ్యారు. పెళ్ళి చేసుకుంటానన్న ఆ ప్రబుద్ధుడు ఆమెను మోసం చేసి ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆవిడమాత్రం అతని పేరును వెల్లడించటానికి నిరాకరించింది."

"సరే. కళ్యాణి ఫొటో నీ దగ్గరుందా?"

"ఉంది."

"ఓసారి ఇవ్వు."

ఇచ్చాను. ఓ క్షణం చూసి జేబులో పెట్టుకుని గంభీరంగా అన్నాడు తాతయ్య.

"నీ సహనానికి హద్దు ఎన్ని మైళ్ళో నీకు తెల్సా? నీ హృదయ వైశాల్యం ఎన్ని చదరపు కిలోమీటర్లో అంచనా వేయగలవా?"

అవహేళనో. హాస్యమో తెలియని ఆ ప్రశ్నలకు జవాబు ఏం చెప్పాలో తెలియలేదు.

"పోనీ. ఈ ప్రశ్నలకు జవాబు చెప్పు. నీ పెళ్ళాం ఓ పతిత గారాలపట్టి అని పదిమందీ నిన్ను వేలెత్తిచూపించి అనుక్షణం చిత్రవధ చేస్తుంటే సహించే ఓపిక నీకుందా? సంఘం - సమాజం. లోకం - లోకులు ఏకమై విమర్శించే విమర్శనలకు తలవొంచి. వెలివేస్తే భరించి ఒంటరిగా



హిందుస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

జీవించటానికి అంతటి మనోధైర్యం ఉందా? సమాధానం చెప్పు!"

తాతయ్య వేసిన ప్రశ్నలు ఓ నిముషంలోనే జవాబులు చెప్పలేనివి. అందుకే ఏం మాట్లాడలేకపోయాను

"అది సరే. ఏమనుకోకు. మనలో మనమాట. అసలీ కళ్యాణి సంబరేంటి?" గుబురుగా పెరిగిన మీసాల్ని నిమురుకుంటూ చిరునవ్వుతో అన్నారు తాతయ్య.

సంబరేంటేమిటనుకొని పైకి అదే అడిగాను.

నా ప్రశ్నకు తాతయ్య నవ్వుతూన్న వాడల్లా ఆగిపోయి నే నూహించలేనంత గంభీరంగా అన్నారు.

"ప్రతి మనిషికి ఆశలు - ఆశయాలు, కలలు- కన్నీళ్ళు ఉంటాల్సిందే. కాని ఎంత వరకు? మన మనోధైర్యాన్ని మించనంతవరకు భూమిలో పునాదులు లేనిపోకుండా గాలిలో మేడలు కట్టినంత వరకు. కాలే కన్నీరు రక్తంగా మారనంతవరకూ. కాని కృతిమించి రాగాన పడితే మిగిలేది నలుగురిలో నవ్వులాటే. పుస్తకాలలో వ్రాయబడి ఆచరించలేని ఆదర్శాలు కొన్ని ఉన్నాయి. నీ వివాహ తలంపు అందులోకి చేర్చొచ్చు. పది మందిలో అగ్ని సాక్షిగా వివాహమాడి పెనిమిటితో ఏడడుగులు నడిచిన స్త్రీకి ఇవ్వబడే గౌరవం మెళ్ళో మంగళ సూత్రం కట్టించుకోలేకపోయినా తన సర్వస్వం ప్రియుడికి అర్పించి అతనినే ఆరాధిస్తున్న స్త్రీకి లభించదు. ఇద్దరూ స్త్రీలే. కాని హక్కులూ, బాధ్యతలూ వేరు. సంఘం వేసే ముద్రలు వేరు. ఏమంటావ్?" అంటూ నా వంక చూసాడు తాతయ్య.

తాతయ్య చెప్పిన విషయాలు చాలా వరకు నిజం!

కాని కళ్యాణిని వదులుకోటం ఎలా?

తల్లి చేసిన తప్పుకు తనయకా శిక్ష!

ఓ పెరికివంద చేసిన మోసానికి మరో అమాయకురాలికా మచ్చ!

ప్రేమకు పర్యవసానం కళంకమా?

ఆరాధనకు ప్రతిఫలం అపనిందా?

పెద్దల భూతకాలం యవ్వన వేడికి పిల్లల భవిష్యత్ సుఖస్వప్నాలు బలి పశువులా?

ఘోరం! అన్యాయం!! అక్రమం!!!

తాతయ్య నా ఆలోచనలు గమనించి మళ్ళా మొదలు పెట్టాడు.

"మనుషులు మారి ఆదర్శవంతులుగా రూపొందుతున్నారని, విశాల భావాలు పెంపొందించుకుంటున్నారని నువ్వు అపోహపడుతున్నావేమో. అది తప్పు! నాగరికత ఒకో మెట్టు ఎగప్రాకుతూంటే మానవత్వం ఒకో మెట్టు దిగజారుతోంది. మన భావాల వెనుకగా పెరిగే స్వార్థాన్ని మనం కప్పి పుచ్చుకుంటూ విశాల భావాలని ఆత్మద్రోహం చేసుకొంటున్నాం. మానవుడు సంఘజీవి అందుకే కళ్యాణిని నువ్వు వివాహం చేసుకునేందుకు వీలు లేదు. అపచవ పదార్థానికో రుచి. కామానికో వరసా ఉండవు. బాగా ఆలోచించి ఓ నిర్ణయానికిరా. నా ఆస్తి, నా అండ నీకు లేకపోతే నీ నెత్తిమీద అర్ధరూపాయి పెట్టి ఆదివారం సంతలో వేలం వేసినా ఐదు పైసల కంటే ఎక్కువ రాదు జాగ్రత్త." అంటూ

చరచరా వెళ్ళిపోయాడు

• • •

నేను ఓడిపోయాను !

కళ్యాణిని వివాహం చేసుకోలేకపోయాను. కాని అందుకు కారణం నా పిరికితనం. తాతయ్య ఎరగా చూపించిన ఆస్థి మాత్రమే కావు. చెప్పా చెయ్యకుండా కళ్యాణి అకస్మాత్తుగా తల్లితో సహా ఎక్కడికో వెళ్ళిపోయింది. ఈ పలాయనంతో అంతరార్థం నేనంతగా అప్పట్లో అర్థం చేసుకోలేక పోయానుగాని ఇప్పుడు కళ్యాణి పరారుకు మూలకారణం తాతయ్యేనని నా ప్రగాఢ నమ్మకం. ఎంతోమంది చేత ఆదర్శవాది అని అనిపించుకున్నా తాతయ్య నా వివాహ విషయంలో వెను కంజవేసి నాకు తీరని అన్యాయం చేశాడు

• • •

నే నిపుడు మా ప్రాంతంలో కెల్లా పేరు మోసిన క్రిమినల్ లీడింగు లాయర్ని శారద అనే లక్ష రూపాయల ఆస్తికి తాళికట్టి ఇద్దరు పిల్లల్ని కూడా కన్నాను. పెద్ద పిల్ల 'కళ్యాణి' ఐదో క్లాసు చదువుతోంది. వాడిగాడు విన్నే ఒకటో క్లాసు పుస్తకం కావాలని తెగమారాం చేశాడు. ఆస్తిపంపకాలు- హత్యలు, విడాకులు- దోపిడీలు లాంటి అనేక రకమైన కేసులతో నాకు ఓ క్షణం కూడా ఖాళీ దొరకటం లేదు. నిరుద్యోగ సమస్యవల్ల కాలోలు ఇద్దరు బి. యి. లు నా దగ్గర గుమాస్తాలుగా చేరారు. మెల్లిగా వలుకుబడి సంపాదించి ఓ నాలుగు పెద్ద కంట్రాక్టులు సంపాయించి వాళ్ళను సరిగా వాడుకోవాలి. ఎందుకైనా పనికి వస్తారని శిక్షలు ఓ అర్ధ డజను కొని అద్దెకు—అద్దె గురించే కాదనుకోండి—తిప్పుతున్నాను. కార్మికులు మరీ మొహమాటం పెట్టటం వల్ల వాళ్ళ యూనియన్‌లో ఓ అనరరీ పొజిషన్‌ను నిర్వహిస్తున్నాను. ఈ మధ్యే ఓ సర్పంచి హత్యా కేసులో నా వాదనా పటిమవల్ల దోషు లిద్దరు 'పరిస్థితుల ప్రభావం వల్ల, ఆత్మరక్షణార్థం ఆయుధాలు ప్రయోగించటం జరిగింది' అనే నెపంతో నిర్దోషులుగా నిర్ణయింప బడటంతో నా స్థాయి కొంచెం పెరిగింది. నా శ్రీమతి శ్రీ శారదాదేవి ధర్మ దేనువు గుర్తుతో మునిసిపల్ ఎలక్షనులలో పోటీ చేసి నెగ్గింది వచ్చేసారి జనరల్ పోటీలో

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు !

అదే గుర్తుతో వింటుందామని అనుకుంటున్నట్టు కూడా ఎప్పుడో చెప్పిందనే నాకు జ్ఞాపకం. ఇంత గజిబిజి గతుకుల జీవితంలో నాలోని మరో రావుడు అప్పుడప్పుడూ మేల్కొని కళ్యాణిని జ్ఞాపకం చేసి కాస్త విశ్రాంతి ఇస్తాడు.

"ఏదండి రావుడుగారూ ఏమిటిలా దయ చేసారు ?"

"ఏముంది. మామూలే."

"అంతా కుశలమేనా ?"

"ఆ! తమరి దయవల్ల."

"ఆహా! అలా అనకు. ఈ మధ్య చాలా పెద్ద వాడివై పోయావు కదూ. ప్రజలు మొహం మీద ఉమ్మేసినా తుడిచేసుకుని 'పరాయా సొమ్మా ? మన ప్రజలదే కదా !' అని చిరునవ్వుతో సమాధాన పడేంతటి రాజకీయ వేత్త సహనాన్ని కూడా సంపాయించేసుకున్నావ్."

"వేళాకోళం చేస్తున్నావా ?"

"అబ్బే ఎంత మాట ! మర్చిపోయావా ?"

"ఎవర్ని ?"

"ఎవర్నేమిటి ? అజంతాని సుగుణాల ఖనిని. నీ పిరికితనంకు బలై పోయిన ఓ అబలను."

"నా కళ్యాణినా ?"

"అబ్బా!! పేరు కూడా జ్ఞాపకముందే."

"చాలా ఘోరంగా మాట్లాడుతున్నావు. నా సంగతి నీకు తెలియదా ? ఆమె జాడ తెలిస్తే రెక్కలు కట్టుకుని వాలతాను."

"అసలు బ్రతికే ఉందంటావా?"

"ఛి ఛీ! అవేం మాటలు బ్రతికే ఉంటుంది. చూస్తాను. ఎప్పటికైనా ఆమెను చూసి తీరతాను.

"ఏమిటో నమ్మకం ?"

"చెప్పలేను."

"సరే. కళ్యాణి ఎలా చదువుతోంది?"

"నంబర్ వన్‌గా కళ్యాణిలో నాకు కళ్యాణి కనిపిస్తుంది."

ఆ పేరు పెట్టినందుకు తాతయ్య ఏమీ అనలేదూ ?"

"లేదు. అదే ఆశ్చర్యంగా ఉంది."

"ఆశ్చర్య మేముందిలే. తాతయ్య చాలా మంచివాడు.

"ఆ! గొప్పే. ఆయన మంచితనం మన్వే చెప్పాలి. నాకు పనుంది గాని మళ్ళా కనిపించు. గుడ్‌నైట్."

"వెరీ నైట్!"

* * *

"కళ్యాణికి సీరియస్‌గా ఉందట. వెంటనే వెళ్ళాలి పద." అంటూ తాతయ్య చాలా కాలానికి పలకరించి. హడావిడిగా ఆజ్ఞాపించే సరికల్లా నేను తెల్లబోయాను.

"ఎక్కడుంది?" అంటూ ఆత్రుతగా ప్రశ్నించాను.

"వివరాలు తరువాత. వెంటనే బయలుదేరు. నీ గురించి కలవరిస్తోందట. కడసారి చూపుకైనా అందుకోవాలి." అన్నాడు తాతయ్య

ఉన్నపాటున వంద మైళ్ళ దూరంలో ఉన్న గమ్యస్థానంకు బయలుదేరాం కారులో.

తాతయ్య కూడా కళ్యాణిని మరిచిపోలేదన్న మాట ?

నా ఆనందానికి హద్దులేకుండా ఉంది నా అజంతాను కొన్ని సంవత్సరాలైన

తరువాతైనా చూడబోతున్నాను. కాని మరుక్షణంలో నన్ను విషాదం ఆవహించింది. కళ్యాణి నా గురించి కండ్లు కాయలు కాసేలా నిరీక్షించి మరణశయ్యపై ఎదురు చూస్తోంది.

నిరాశ. నిస్పృహ. దైన్యం. పశ్చాత్తాపం నన్ను దహించి వేస్తున్నాయి. ఒక్కసారి ఉన్న పాటున కళ్యాణి కాళ్ళ మీద పడి భోరున విలపించి. నా కన్నీటితో ఆమె పాదాలను అభిషేకం చెయ్యాలనిపించింది. నా తెలివి తక్కువతనం. తాతయ్య ఎరగా చూపించిన ఆస్థి. భవిష్యత్తుపై నేను స్వార్థంతో పెంచుకున్న బంగారు కలలు. అచరణ కందని ఆశయ సూత్తులు నన్ను మోసం చేసి నా కళ్యాణిని నాకు అందనంత దూరంగా విసిరివేశాయి. విసిరివేయబడ్డ కళ్యాణి వెర్రిగా చూస్తూ. నాకోసం ఆక్రోశిస్తూ. సొమ్మసిల్లి కొన ప్రాణంతో ఎదురు చూస్తోంది.

లేదు! నా కళ్యాణి చచ్చిపోటానికి వీల్లేదు. ఆ అజంతా అందం మట్టిలో కలవటానికి నేను ఒప్పుకోను. ఎవరేని ఆ సౌందర్య పెన్నిధి పాతర పాలవటాన్ని నేను సహించను. నా ఆస్థి. నా పరువు. నా ప్రతిష్ఠ. నా సర్వస్వం కళ్యాణికి అర్పిస్తాను. ఆమెను కాపాడుకోలేని జీవితం నిరర్థకం.

విరుద్ధ భావాల సంఘర్షణతో నలిగిపోయిన నా మనస్సు నా స్వాధీనం తప్పిపోయింది.

* * *

నే వెళ్ళేసరికి అంతా అయిపోయింది.

కళ్యాణి చచ్చిపోయింది.

కాదు. కాదు! నిర్దాక్షిణ్యంగా నిలువునా హత్య చేయబడింది. దారుణంగా అపనిందలతో ఖూనీ చేయబడింది. కర్కోటకంగా మానసికంగా నలిపివేయబడి నేలకూల్చబడింది.

ఆమె మృతదేహం చూడగానే నాకు విపరీతమైన వైరాగ్యం కలిగింది. ఎంత ప్రయత్నించినా ఓ కన్నీటి బొట్టు కూడా రాల్చలేక పోయాను. ఎవరీ కళ్యాణి? ఏమిటి మా అనుబంధం?

నే నెందుకు ఎవరికోసం బ్రతకాలి?

నాలాంటి ఓ చిన్న అల్పజీవి సృష్టిలో లోపిస్తే వచ్చిన నష్టం ఏమిటి? మానవ సృష్టి లేనపుడు ఈ లోకం ఎలా ఉండేది? మనుషుడు ఎందుకు సృజింపబడ్డాడు?

నా ఆస్తి. తాతయ్య. కళ్యాణి. శారద. ప్లీడరీ ఏమిటివన్నీ? వీటివల్ల నే సాధించే దేముంది?

అంతా మిథ్య.. .సర్వస్వం మాయ!

ఎవ్విరిథింగ్ ఈజ్ నథింగ్!

ఈ లోకంలో ఎవరూ ఎవ్వరికీ ఏమీ కారు.

అంతా స్వార్థపరులు. వంచకులు. ద్రోహులు!

మెదడు తిమ్మిరెక్కి పని చేయటం మానేసింది.

లేత తమలపాకులాంటి కళ్యాణి పెదవులు అర్ధచంద్రాకారంగా వంగి 'రామూ' అంటూ తియ్యగా కలవరించి నన్ను పిలుస్తున్నట్లుగా అనిపించింది.

నాకు ఏం మాట్లాడాలో తెలియటం లేదు. నిర్లిప్తంగా శూన్యంలోకి గాజు కళ్ళతో చూస్తూ కూర్చుండిపోయాను.

"నన్ను క్షమించు రాము! కళ్యాణి మరణానికి నేనే కారణం. నా పాపానికి

"విస్మృతిలేదు." అంటూ తాతయ్య చిన్న పిల్లాడిలా వలవలా ఏడవటం నాకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

"కళ్యాణి ఇంకా బ్రతికి నాగురించి ఎదురుచూస్తోందని నాకు ఎందుకు తెలియజేసావు తాతయ్యా" అంటూ బాధగా ప్రశ్నించాను.

"అవసరం ఉంది. ఇదిగో కళ్యాణి వ్రాసి నీ కిమ్మన్న ఉత్తరం చదివితే నీకు అర్థమవుతుంది." అంటూ తాతయ్య నాకు ఓ ఉత్తరం అందించాడు.

డియర్ రామూ!

నీ అజంతా వ్రాసే కథపారి ఉత్తర సారాంశం ట్రాజడీయే ఐనా మన సాంప్రదాయానికి కామిడీయే అవుతుంది. చరిత్రకు పునరుక్తి లక్షణం ఉందట.

నిజం నిప్పులాంటిది. కప్పబడ్డ నిప్పు ఎప్పటికో అప్పటికి ఎగరాల్సిందే. ఓ రహస్యం చెపుతాను. ఆశ్చర్యపోకు! అసహ్యించుకోకు! పూర్వకాలంలో ఈజిప్టుదేశంలో అన్నాచెల్లెళ్ళు అధికారం కోసం వివాహాలుచేసుకునేవారట. నాభర్తగా వూహించుకున్న నిన్ను నా నోటితో మరో వరసపెట్టి పిలవలేను అందుకే ఈజన్మకు విడాకు లిస్తున్నాను. వచ్చే జన్మలో వద్దన్నా నీ భార్యగా పుట్టితీరతాను.

అమ్మను మోసం చేసి నా జన్మకు కారణభూతమైన నా తండ్రి నీకు పెదనాన్న. తాతయ్యకు వెరచి, అమ్మకు సరియైన సంజాయిషీ ఇవ్వలేక పరారయ్యాడు. ఈ కథ చెప్పి తాతయ్య నన్ను పరారుచేయించాడు. జీవచ్ఛవంలా బ్రతకటంకంటే హీనమైంది మరోటి ఉండదు. ఆత్మహత్య పాపమని నాకు తెల్సు. ఐనా తప్పదు. ఇంక సెలవ్. నీ

కల్యాణి.

ఉత్తరం చదివిన తరువాత నా కళ్ళల్లోంచి రాలిన రెండు కన్నీటి బొట్లు కళ్యాణి గురించో లేక హైందవ సాంప్రదాయానికి మచ్చ ఏర్పడకుండా నన్ను కాపాడి కాయ్య ఐపోయిన తాతయ్య గురించో నాకు తెలియలేదు! •

అన్నిచోట్లకు ఏజంట్లు కావలెను
RUBBER STAMPS రబ్బరు స్టాంప్సు
PRINTING BLOCKS ప్రింటింగ్ బ్లాక్సు
HOARDINGS, CINESLIDES, హోర్డింగ్సు, సినిమాస్లైడ్సు
FLOWRSENT TINBOARS, ఫ్లోరసెంట్ టిన్‌బోర్డ్సు
S.V.S ANAND ARTS
ఎస్.వి.యస్. ఆనంద్ ఆర్ట్సు